# నీతి - నిజాయితీలు

**- ఆశీర్వదింప బడటానికి మార్గాలు**

ఆశీర్వాదము అంటే భగవంతుడితో ఎడతెగని సంబంధాన్ని సదా కలిగివుండటము (Continuous Connection with God) అని మనము పూర్వమే తెలుసుకుని వున్నాము. భగవంతుడు ప్రేమమయుడు కాబట్టి మనలను ఆశీర్వదించటానికి సర్వదా సిద్ధంగానే వున్నాడు. కానీ జీవి ఆ ఆశీర్వాదాన్ని పొందడానికి సిద్ధంగా లేదు. భగవంతుడి చేత ఆశీర్వదించ బడటం జీవికి కూడా ఇష్టమే, దాని కోసమే జీవి ప్రయత్నిస్తోంది కానీ పొందలేకపోతోంది. ఆశీర్వదించే భగవంతుడు, ఆశీర్వాదం పొందే జీవి ఇద్దరూ ఇష్టపడుతున్నా జీవి ఆశీర్వదింప బడలేక పోతోంది. జీవి ఆశీర్వదింప బడటానికి మార్గాలను గురించి ఈ శుభ తరుణంలో తెలుసుకుందాం !

ఆశీర్వాదం పొందడానికి జీవికి దోహదం చేసే విషయాలు నీతి - నిజాయతీలు. ఈ నీతి, నిజాయితీలు భగవంతుడు కూడా కలిగివున్నాడు. భగవంతుడే మనకు ఆదర్శం కాబట్టి మనమూ భగవంతుడిలానే నీతి నిజాయితీలు కలిగి వుండాలి. అప్పుడే జీవి సదా ఆశీర్వదింపబడుతుంది. భగవంతుడు కలిగి వున్న నీతి నిజాయితీలు ఎలాంటివో, మనము కలిగి వుండాల్సిన నీతి నిజాయితీలు ఏమిటో విడి విడిగా వివరంగా తెలుసుకుందాం.

మన యజమాని సమస్తానికి ఆధారుడైవున్నారు. వారిని ప్రశ్నించే వారు కానీ విమర్శించే వారు కానీ లేరు. అయినా వారు జీవి కోసం నీతి నిజాయితీలను కలిగి వున్నారు.

**మన యజమాని నీతి :** జీవిని, జీవి ఎంచుకున్న మార్గములోనే నడిపించటం యజమాని నీతి. జీవి ఎంచుకున్న మార్గము, జీవి ఉద్దేశ్యము యజమాని చిత్త ప్రకారం లేకున్నా సరే జీవి బాధ పడకూడదని నిరుత్సాహ పడకూడదని జీవిని, జీవి ఉద్దేశ ప్రకారమే నడిపింప చేస్తారు యజమాని. జీవిని తన చిత్త ప్రకారమే నడవమని ఒత్తిడి చేసి నిర్భందించరు యజమాని. జీవి నిరుత్సాహపడి వెనుక అడుగు వేయకూడదని జీవి ఉద్ధరింపునే కాక్షించి జీవిని జీవి ఎంచుకున్న పద్ధతిలోనే పురోగతిలోకి తీసుకువెళ్ళటం యజమాని యొక్క నీతి. అలా చేయకపోతే జీవి తను అనుకున్నట్లుగా జరగడం లేదని తొలిదశలోనే ప్రయాణం ఆపేస్తుందని బాగుపడదని జీవి మీద జాలితో యజమాని జీవిని జీవి పద్ధతిలోనే నడపాలన్న నీతిని కలిగి వున్నారు.

**యజమాని నిజాయితీ :** జీవిని, జీవి యొక్క పద్ధతిలో నడుపుతు న్నప్పుడు ఆ మార్గములో ఎదురయ్యే సమస్యల నుండీ జీవిని రక్షిస్తూ, నిజ మార్గము గురించి గుర్తు చేస్తూ వుండటమే యజమాని నిజాయితీ, వివరణలోకి వెళ్తే, "నువ్వు ఎంచుకున్న మార్గమేగా అనుభవించు" అని జీవిని దాని ఖర్మానికి దానిని వదిలేయట్లేదు. ఆ అప సవ్య మార్గంలో కూడా జీవికి వెన్నంటి వుండి జీవిని రక్షిస్తుంటారు యజమాని. అంతే కాకుండా నిజమార్గము వేరే వుంది అని దాని గురించి జీవి విన్నా వినకున్నా దానిని ఏదో ఒక రకంగా బోధిస్తూనే వుంటారు. జీవిని జీవి ఇష్ట ప్రకారం నడిపించటం యజమాని నీతిగా, జీవిని జీవి ఇష్ట ప్రకారం నడిపిస్తూ కూడా నిజమార్గాన్ని నిరంతరం సూచిస్తూ వుండటం యజమాని నిజాయితీగా మనము గుర్తించాము.

ఇక జీవికి వుండాల్సిన నీతి - నిజాయితీల గురించి, వాటిని కలిగివుండటం వల్ల వచ్చే లాభాల గురించి తెలుసుకుందాం.

**జీవి నీతి :** యజమానిని వారి శైలిలో జీవి దగ్గర వ్యవహరించనివ్వడం జీవి నీతి. జీవి తన ఇష్టాయిష్టాలను తన అభిప్రాయాలను తనఆలోచనలను వదలి వాటి కన్నా యజమాని ఉద్దేశము ఉత్తమమైనది, మేలైనది నిజమైనదిగా నమ్మి వారి మార్గాన్ని అనుసరించడం జీవి నీతి.

**జీవి నిజాయితీ :** యజమాని తనదైన శైలిలో జీవి దగ్గర వ్యవహరిస్తున్నప్పుడు ఆ పనిలో జీవి జోక్యం కలుగ చేసుకోకపోవడం జీవి నిజాయితి. ఈ పని ఇలా ఎందుకు జరుగుతోందని ఆరా, ఇంకోలా చేయమని సలహా, ఇలానే చెయ్యమని పెత్తనం అలా చేయక పోతే ఎదురు తిరగడం, నిరుత్సాహపడటం, దుఃఖించడం లాంటివి ఏమీ చేయకుండా ఆ పనికి పని తీరుకి యజమానికీ కూడా సాక్షిగా వుండాలి జీవి. అదే జీవి నిజాయితి.

జీవి యజమానిని తనదైన శైలిలో పని చేయనిస్తూ నీతిని, ఆ పనిలో జోక్యం చేసుకోకుండా నిజాయితిని కలిగి వుంటే ఆ జీవి దగ్గర యజమాని వ్యవహార శైలి కనబడుతుంది అంటే ఆ జీవికి సమస్తమూ సమకూడిజరుగు తుంది. ఆ జీవి దగ్గర నిరంతరమూ యజమాని శైలే కనబడుతుంది.

కాబట్టిఆ జీవి నిరంతరం యజమాని అనుసంధానంలోనే వుంటుంది అంటే ఆ జీవి ఆశీర్వదింపబడుతుంది. నీతి - నిజాయితీలు జీవి ఆశీర్వదింపబడటానికి దోహదపడతాయి.

భగవంతుడే జీవి ఉద్ధరింపుకోసం నీతి - నిజాయితీలను కలిగి వున్నాడని మనము గమనిస్తే మనము కూడా నీతి నిజాయితీలను కలిగి వుండగల్గుతాము. భగవంతుడికి మనపైన వున్న ఆ అపారమైన ప్రేమను, కరుణను, కృపను, దయను, క్షమను గుర్తించిన క్షణంలో మన సొంత పద్ధతులు కరిగిపోయి నీతి నిజాయితీలను కలిగి వుండగల్గుతాము. ఏ క్షణమైనా ఏ మరచి సొంత పద్ధతుల్లోకి వచ్చినప్పుడు కంగారు పడక ఒకసారి భగవంతుని నీతి - నిజాయితీలు గుర్తిస్తే మళ్ళీ యజమాని శైలిలోకి వెళ్ళగల్గుతాం.

ఆశీర్వదించడమే కాక, ఆశీర్వాదం అందుకొనే మార్గాల్నీ బోధిస్తున్నారంటే యజమానికి జీవి ఉద్ధరింపు ఎంత ఇష్టమైందో అర్ధమవుతోంది. జీవిపై వారికి వున్న ప్రేమ మరోసారి నిరూపించబడుతోంది. అంతటి ప్రేమమయుడైన అఖండ పరిపూర్ణుడికి అనంతకోటి నమస్కారాలు చేద్దాం!

"ఇంతకాలం నేను నా పద్ధతిలో నేర్చుకున్నది అంతా వృథా అయిపోతోందా" అని విచారించడం మాని యజమాని పద్ధతే మేలైనది, నిజమైనది అని మన సమస్తానికి ప్రచారం చేద్దాం! నీతి నిజాయితీలను కలిగి ఆశీర్వాదం పొందుదాం!

---

నీతి వంతా జై ! నిజాయితీ పరుడా జై ! ఆశీర్వాద కారకా జై ! ఆశీర్వాదమా జై !

**గిరిధర్ వాణి ఆనందనందనం**

**డిసెంబర్ 15 2009**

**గురుమా గారి జన్మదిన వేడుకలు**